పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత


భక్తురాలికి బ్యాగుతో పాటు నగదును అందజేస్తున్న అదనపు వీఐ బ్రహ్మానందరాజు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తురాలు బ్యాగును పోగొట్టుకోవడంతో వాటిని తిరిగి ఇచ్చి విజిలెన్స్ అధికారులు నిజాయితీ చాటుకున్నారు. అనంతపురానికి చెందిన లలితమ్మ తన కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా దర్శన సమయంలో ఆమె వద్ద ఉన్న బ్యాగు కనిపించకుండా పోయింది. విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సీసీ ఫుటేజ్ ద్వారా బ్యాగును గుర్తించారు. అడిషన్ వీఐ బ్రహ్మానందరాజు ఆధ్వర్యంలో బ్యాగుతో పాటు అందులోని రూ.11,500 నగదు ఇతర వస్తువులను భక్తురాలికి అందజేశారు. భక్తురాలు టీటీడీ విజిలెన్స్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

దేశ సేవకు వేళాయె!

- సైనిక్ స్కూల్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశాలు
- నోటిఫికేషన్ విడుదల


విద్యార్థుల కవాతు

తిరుపతి ఎడ్యుకేషన్: దేశభక్తిని చాటుకోవాలనే తపన ఉన్న విద్యార్థులకు సైనిక్ పాఠశాలలు చక్కని అవకాశం కల్పిస్తున్నాయి. సైనిక్ పాఠశాలల్లో 2025-26లో 6, 9 తరగతుల్లో ప్రవేశం పొందేందుకు మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. దేశ రక్షణలో భాగంగా త్రివిధ దళాలకు అవసరమైన సైనిక అధికారులను తయారు చేయాలన్న లక్ష్యంతో దేశ వ్యాప్తంగా సైనిక్ పాఠశాలలను ప్రారంభించారు. సైనిక్ పాఠశాలల్లో ఆరు, తొమ్మిదో తరగతికి బాలబాలికలు ప్రవేశం పొందవచ్చు. ఇందులో సీటు పొందడానికి సైనిక పాఠశాల నిర్వహించే ప్రవేశ పరీక్ష, వైద్య పరీక్షల్లో నెగ్గాలి. ఇక్కడ ఇంటర్మీడియెట్ వరకు విద్యను కొనసాగించవచ్చు.

సిలబస్..
ఆరో తరగతిలో ప్రవేశానికి 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో గణితం 150 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ 50 మార్కులకు, భాషా సామర్థ్యం 50, జనరల్ ఇంటెలిజెన్స్ 50మార్కులకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులు ప్రతి విభాగంలో కనీసం 25 శాతం మార్కులు సాధించాలి. అన్ని సబ్జెక్టులు కలిపి 40శాతం మార్కులు రావాలి. ఇక తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి 400మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో గణితం 200మార్కులకు, సామాన్యశాస్త్రం 50, ఆంగ్లంలో 50, సాంఘికశాస్త్రం 50, జనరల్ ఇంటెలిజెన్స్ 50మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి విభాగంలో కనీసం 25శాతం మార్కులు తప్పనిసరిగా సాధించాలి. అన్ని సబ్జెక్టులు కలిపి 40శాతం మార్కులు రావాలి.

సౌకర్యాలు
ఆరు నుంచి ఇంటర్ వరకు విద్య, వసతితో పాటు ఎన్‌సీసీ, యోగ, చిత్రలేఖనం, సంగీతం, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్, గుర్రపు స్వారీ ఇతరత్రా సహ పాఠ్య కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 50శాతం విద్యార్థులకు రక్షణ శాఖ నుంచి ఉపకార వేతనం అందుతుంది. ఆర్థికంగా వెనుకబడ్డ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాన్ని పొందవచ్చు. సైనిక్ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ పూర్తయిన తరువాత నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్ష (ఎన్‌డీఏ) నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే పూణేలో రెండేళ్ల శిక్షణ ఇస్తారు. ప్రతిభ ఆధారంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో అధికారులుగా నియమిస్తారు.

నోటిఫికేషన్ విడుదల
సైనిక్ స్కూళ్లల్లో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి 24వ తేదీ సాయంత్రం నోటిఫికేషన్ విడుదలయ్యింది. విద్యార్థులు జనవరి 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ''హెచ్‌టీటీపీఎస్://ఈఎక్స్‌ఏఎంఎస్.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్/ఏఐఎస్ఎస్ఈఈ'' (https://exams. nta.ac.in/AISSEE)వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్షా విధానం
సైనిక్ ప్రవేశ పరీక్ష పూర్తిగా రాత విధానంలో ఉంటుంది. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు రెండున్నర గంటలు, తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షకు 3గంటల పరీక్ష సమయం ఇస్తారు. ఆరో తరగతి పరీక్ష గుర్తింపు పొందిన అన్ని ప్రాంతీయ భాషల్లో, తొమ్మిదో తరగతికి ఆంగ్లంలో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు.

ఫీజు వివరాలు
నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు జనరల్, ఓబీసీ(ఎన్‌సీఎల్),డిఫెన్స్, ఎక్స్ సర్వీస్‌మెన్ రూ.800, ఎస్సీ, ఎస్టీలు రూ.650చెల్లించాలి. దేశ వ్యాప్తంగా 190 నగరాల్లో ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్ష తేదీని త్వరలో ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ప్రకటించనున్నారు.

రిజర్వేషన్లు
ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, రక్షణ శాఖలో పనిచేస్తున్న, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు 25శాతం సీట్లు కేటాయిస్తారు. ఆరో తరగతికి 80 సీట్లు, తొమ్మిదో తరగతికి 20 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ఎవరు అర్హులంటే
ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే బాలబాలికల వయస్సు 31 మార్చి 2025కి 10 నుంచి 12 ఏళ్లలోపు ఉండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే బాలురు వయస్సు మార్చి 31, 2025కి 13 నుంచి 15 ఏళ్లలోపు ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.

ఉజ్వల భవిష్యత్తు



దేశ వ్యాప్తంగా 33 సైనిక పాఠశాలలు భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ ఆధీనంలో పనిచేస్తాయి. ఈ పాఠశాలల్లో ఏటా ప్రవేశ పరీక్ష ద్వారా బాలబాలికలకు 6, 9 తరగతిలో ప్రవేశాలు కల్పిస్తాయి. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. సైనిక్ స్కూల్‌కు సంబంధించి పూర్తి వివరాలకు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రాన్ని నేరుగాను, 86888 88802 నంబరులోను సంప్రదించవచ్చు.

– ఎస్.విశ్వచందన్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్, విశ్వం విద్యాసంస్థలు, తిరుపతి

ఇసుకపై ఉత్తుత్తి మాటలేనా?

- 39 రోజుల తర్వాత అదే గణాంకాలు
- నవంబర్ 15 సమావేశంలో ఇచ్చిన లెక్కలే డిసెంబర్ 24న కూడా
- నాలుగు నెలలుగా ప్రభుత్వ ఉచిత ఇసుక శూన్యం

తిరుపతి అర్బన్: ఉచిత ఇసుకపై జిల్లా అధికారులు ఉత్తుత్తి మాటలే చెబుతున్నారన్న విమర్శలు లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఉచిత ఇసుక ప్రక్రియను నిలుపుదల చేసి నాలుగు నెలలు గడుస్తోంది. ఈ ఏడాది జూలై 8వ తేదీన ఉచిత ఇసుక పాలసీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తాపై ఆగస్టు వరకు తూతూమంత్రంగా ఇసుక పాలసీని కొనసాగించారు. తర్వాత ఇసుక లేదని సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు ఈ ప్రక్రియను నిలుపుదల చేశారు. ఉచితం అంటూనే.. వెంకటగిరి పరిధిలోని మెగళ్లగుంటలో టన్ను రూ.590కి, సూళ్లూరుపేట పరిధిలోని మావిళ్లపాడులో టన్ను రూ.465కి, సత్యవేడు పరిధిలోని పిచ్చాటూరులో టన్ను రూ.200కి, నాగలాపురంలో టన్ను రూ.200కు 50 రోజుల పాటు అరకొరగా అందుబాటులో ఉంచారు. ఆ తర్వాత ప్రభుత్వ ఉచిత ఇసుక మాటేలేదు.

నాడు ఏడు పాయింట్లలో ఉచిత ఇసుక


నవంబర్ 15న జరిగిన సమావేశంలో అధికారులు

గత నవంబర్ 15వ తేదీ శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు ఉచిత ఇసుకపై సమావేశం నిర్వహించారు. జూలై 8 ఏర్పాటు చేసిన నాలుగు పాయింట్లలో ఇసుక లేకపోవడంతో.. నవంబర్ 30 నుంచి జిల్లాలో అదనంగా మూడు పాయింట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో కోట మండలంలోని గూడలి గ్రామం సమీపంలో స్వర్ణముఖి బ్యారేజీ వద్ద ఒక పాయింట్, పెళ్లకూరు మండలం, పాలచూరు, పుల్లూరు గ్రామాల వద్ద రెండు ఇసుక పాయింట్లు అందుబాటులోకి తీసుకొస్తామని మాటిచ్చి చేతులు పైకెత్తేశారు.

నేడు అవే మాటలు


డిసెంబర్ 24న జరిగిన సమావేశం లోనూ అవే హామీలు

కలెక్టరేట్‌లో అదే అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ ఇసుక పాలసీలో భాగంగా జనవరి మొదటి వారం నుంచి ఉచిత ఇసుక పాలసీలో భాగంగా మూడు పాయింట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఈ మూడు ఇసుక స్టాక్ పాయింట్ల ద్వారా 1,37,686 మెట్రిక్ టన్నులు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సారైనా మాట నిలుపుకుంటారో లేదో వేచి చూడాల్సి ఉంది.

దూసుకొచ్చిన మృత్యువు

- అంతిమయాత్రకు వెళ్తుండగా ప్రమాదం
- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దూసుకెళ్లిన కారు

రేణిగుంట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అంతిమయాత్ర కోసం సన్నాహాలు చేస్తున్న జనం పైకి కారు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఏర్పేడు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏర్పేడు సీఐ కథనం .. ఏర్పేడు -వెంకటగిరి మార్గంలో సోమవారం బొలెరో వాహనం ఢీకొని దుర్గిపేరి గ్రామానికి చెందిన గాది వెంకటేష్ మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో వెంకటగిరి వైపు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఢీకొంది. అక్కడే గుంపుగా ఉన్న జనాల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మండలంలోని కృష్ణంపల్లెకి చెందిన గెరటారెడ్డి(50), దుర్గిపేరికి చెందిన గాది శ్రీనివాసులురెడ్డి(33), అదే గ్రామానికి చెందిన ఏ.కొండారెడ్డి (57)కి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ఆపై కొండారెడ్డిని స్విమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు రోజుల వ్యవధిలోనే మరణించడంతో స్థానికులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ క్రమంలో కారు డ్రైవర్ శ్రీమౌళి తన భార్యను వెంకటగిరి నుంచి స్విమ్స్ ఆస్పత్రికి డయాలసిస్ కోసం తీసుకెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం


మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి అర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం చేపట్టారు. సమావేశానికి కలెక్టర్‌తోపాటు ఎస్పీ సుబ్బరాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిగర్భంలోని బిడ్డ ఎదుగుదలకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందించాలని, అంతేతప్ప లింగ నిర్ధారణ కోసం పరీక్షలు నిర్వహిస్తే వచ్చే ఇబ్బందులను తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బాలకృష్ణనాయక్, డీఎస్పీ శ్రీలత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి శాంతకుమారి, విస్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మీరా పాల్గొన్నారు.

27న వాలీబాల్ రాష్ట్ర జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27న ఏపీ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర సీనియర్ పురుషుల, మహిళల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.సయ్యద్ సాహెబ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 27వ తేదీన ఉదయం 7గంటలకు ధ్రువపత్రాలు, ఆధారు కార్డు, బర్త్ సర్టిఫికెట్, పది పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరవ్వాలని తెలిపారు. ఎంపికైన రాష్ట్ర జట్లు రాజస్థాన్ రాష్ట్రం, జైపూర్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణను సహించం

పాకాల : ఎస్సీ వర్గీకరణను సహించే ప్రసక్తే లేదని, ప్రభుత్వం వెంటనే తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి యమలా సుదర్శన్, రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్టికల్ 341 సవరించి వర్గీకరణ చేయాలని, ఇందుకోసం జనాభా లెక్కలు తీయాలని కోరారు. లేకుంటే వర్గీకరణ చేయకూడదని, వన్ మ్యాన్ కమిషన్ కూడా చెల్లదని స్పష్టం చేశారు. సమావేశంలో నేతలు గుండ్లపల్లి ఆంజనేయులు, గణేష్, ఆనందయ్య, రామకృష్ణయ్య, రాజేంద్రుడు, జ్యోతి ప్రసాద్, నరసింహులు, ఆంజనేయులు, శివప్రసాద్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం


జీజే.రాజశేఖర్, అధ్యక్షులు; కే.ముత్యాలరెడ్డి, ప్రధాన కార్యదర్శి; బి.మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐక్య ఉపాధ్యాయ వేదిక(యూటీఎఫ్) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన తిరుపతి జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు బత్తల లక్ష్మీరాజ, ఎస్ఎస్.నాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో తిరుపతి జిల్లా అధ్యక్షులుగా జీజే.రాజశేఖర్ (దొరవారి సత్రం), ప్రధాన కార్యదర్శిగా కే.ముత్యాలరెడ్డి(రేణిగుంట), గౌరవాధ్యక్షులుగా దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులుగా ఎం.కుమారస్వామి(వెంకటగిరి), ఈ.గీతమ్మ(పుత్తూరు), కోశాధికారిగా కే.మోహన్ బాబు(శ్రీకాళహస్తి), జిల్లా కార్యదర్శులుగా బండి మధుసూదన్‌రెడ్డి (తిరుపతి), ఎస్.శేఖర్(వడమాలపేట), కే.ప్రభాకర్, కేఎంఎస్.సునీల (సూళ్లూరుపేట), జీ.సుధీర్(గూడూరు), ఐ.మస్తానయ్య (వాకాడు), ఏ.హరిబాబు (ఓజిలి), సీ.సురేష్(తిరుపతి), ఓ.విజయకుమార్, వై.వి జయశ్రీ (తొట్టంబేడు), సీ.వెంకటకృష్ణ (బుచ్చినాయుడుకండ్రిగ), కే.ఆదినారాయణ (వెంకటగిరి), టీ.గోవర్ధనరెడ్డి (నాయుడుపేట) ఏ.హేమాంబరధరరావు (కేవీబి.పురం)లు ఎన్నికయ్యారు. వీరితో పాటు రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ముగిసిన ఉద్యోగోన్నతులు


డీఈఓ చేతుల మీదుగా ఉద్యోగోన్నతి నియామకపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయిని

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఉద్యోగోన్నతుల ప్రక్రియ ముగిసింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించారు. సాయంత్రం కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టి రాత్రి 7 గంటలకు పూర్తి చేశారు. ఈ ప్రక్రియను డీఈఓ వరలక్ష్మి పర్యవేక్షించారు. ఈ ఉద్యోగోన్నతుల ప్రక్రియలో అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 4, గణితం 1, ఫిజిక్స్ 1, బయాలజీ 8, సోషల్ 10, తమిళ మీడియం సోషల్ 1, తెలుగు మీడియం గణితం 1, తెలుగు మీడియం ఫిజిక్స్ 1 పోస్టులకు ఉద్యోగోన్నతులు కల్పించారు. అనంతరం ఉద్యోగోన్నతులు పొందిన టీచర్లకు డీఈఓ వరలక్ష్మి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ రామ్‌కుమార్, సత్య, సీనియర్ అసిస్టెంట్‌లు మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో భద్రత


మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: జిల్లాలో వాణిజ్య సముదాయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. మంగళవారం రామతులసి కల్యాణ మండపంలో వ్యాపారులు, పోలీసుల మధ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొత్తకొత్త సాంకేతిక పరిజ్ఞానాలతో నేరాలు చేస్తున్నారని, వీటికి అడ్డుకట్టు వేయడానికి పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వాణిజ్య సముదాయాల వారు విధిగా షాప్‌ల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఇన్‌స్టాల్ చేయడంపై ఏవైనా సమస్యలుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌ని గానీ, పోలీస్ సమాచారం కోసం 112/80999 99977 సంప్రదించాలని ఎస్పీ సూచించారు. తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు రామకిషోర్, రామకృష్ణ, ప్రెసిడెంట్ చాంబర్ ఆఫ్ కామర్స్ మోహన్‌రాజు, ఆర్ఎస్ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఖాళీ సర్వీసులపై దృష్టి


మాట్లాడుతున్న డీపీటీఓ జగదీష్

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో ఖాళీ సర్వీసులపై దృష్టి పెట్టాలని, ఆర్టీసీ ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ) జగదీష్ సూచించారు. మంగళవారం తిరుపతిలోని ఆయన చాంబర్‌లో ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏయే ఆలయాలకు ఎన్ని సర్వీసులు ఏర్పాటు చేయాలనే అంశాలపై చర్చించారు. మరోవైపు బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. పత్రికల్లో వస్తున్న కథనాలు, ప్రయాణికులు ఇస్తున్న ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తే.. జిల్లా నుంచి ఎన్ని సర్వీసులను అందించడానికి సిద్ధంగా ఉన్నామనే అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, జిల్లా పర్సనల్ ఆఫీసర్(పీవో) సహజాద్, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడు, అకౌంట్స్ అధికారి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



సత్యవేడు: మండలంలోని పెద్ద ఈటిపాకం గ్రామ సమీపంలో మినీ టెంపోలో అక్రమంగా తరలిస్తున్న మూడున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని శ్రీసిటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు సూచనల మేరకు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐ హరిప్రసాద్, పోలీసుల బృందంతో మంగళవారం తెల్లవారు జామున సత్యవేడు - పాండూరు మెయిన్ రోడ్డు పెద్ద ఈటిపాకం వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మినీ టెంపోను పరిశీలించగా 77 బస్తాల రేషన్ బియ్యం బయటపడింది.

రూ.20 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం


ఎర్రచందనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి మంగళం : తిరుపతి జిల్లా నాగలాపురం మండలం రేప్పాల తిప్ప సమీపంలోని అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.20 లక్షల విలువ చేసే ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. అక్రమ రవాణా చేయడానికి ఎర్రచందనం దుంగలు సిద్ధం చేస్తున్న కేవీబీపురానికి చెందిన సురేంద్ర, నాగలాపురానికి చెందిన మునివేలు, తమిళనాడు సేలం జిల్లాకు చెందిన మేస్త్రీ సెల్వరాజితోరై స్వామితో పాటు మరో ఐదుగురు తమిళ కూలీలను అరెస్ట్ చేశారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 28 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,656 మంది స్వామివారిని దర్శించుకోగా 24,360 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

మెకానిక్‌కు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : అనారోగ్యంతో బాధపడుతున్న టూవీలర్ మెకానిక్ మునీర్‌కు తిరుపతి టూవీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.14 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి, కార్యదర్శి జలంధర్, ఉపాధ్యక్షుడు గురు ఆచారి, లక్ష్మణరావు, మహేష్ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న బాలసుబ్రమణ్యం

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో 'సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మల్టీడిసిప్లినరీ స్ట్రాటజీస్' అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో 'బెస్ట్ అకాడమిషన్–2024 అవార్డును ఎస్వీయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఎన్.బాలసుబ్రమణ్యం అందుకున్నారు. పలు వర్క్‌షాపుల్లో పరిశోధనపత్రాలు సమర్పించినందుకు గాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

చంద్రగిరి : స్థానిక ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ప్రతిభ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం ఉప్పరపల్లె, కుంట్రపాకం, రామచంద్రాపురంలోని నడవలూరు, పాకాలలోని పోలిచెట్టిగారిపల్లె, చిన్నగొట్టిగల్లులోని తురకపల్లె, చంద్రగిరిలోని అరిగెలవారిపల్లెలో మెయిన్ అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. రామచంద్రాపురంలోని పుల్లమ్మనాయుడు కండ్రిగ, తిరుపతి రూరల్‌లోని మల్లంగుంట ఎస్టీ కాలనీ, ఎగువనేహిగారిపల్లెలో మూడు మినీ అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువు, నెన్నూరు, పీవీ పురం, అనుప్పల్లె, అనిచెరువు, చల్లావారిపల్లె, తిరుపతి రూరల్ మండలంలోని ఉప్పరపల్లె, దుర్గసముద్రం, పేరూరు ఎన్టీఆర్ కాలనీ, పానకం హరిజనవాడ, పాకాల మండలంలోని గుండ్లగుంటపల్లె, పెద్దరామాపురం, గాదంకి, చంద్రగిరి మండలంలోని అగరాల, ముంగిళిపట్టు, మండపంపల్లె, ఎం.కొత్తపల్లె, ఎర్రవారిపాళెం మండలంలోని నాగినేనివారిపల్లెలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు జనవరి 6వ తేదీలోపు చంద్రగిరిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అన్నప్రసాదం వితరణ



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : ధనుర్మాస పూజల సందర్భంగా కాపువీధిలోని భజన మందిరం వద్ద భక్తులకు మంగళవారం అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఉభయదాత దొడ్డారెడ్డి రామచంద్రారెడ్డి, భజన మండలి సభ్యుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, చిన్నబ్బ, వెంకటనారాయణ, మునికృష్ణయ్య, బాలసుబ్రమణ్యం, లక్ష్మీదేవమ్మ, కేఎస్ రాజా, తిరుపాల్ ఆచారి పాల్గొన్నారు.

అపూర్వం.. ఆగమనం



కాంతులో సుందరంగా అలంకరించిన సీఎస్ఐ చర్చి



విద్యుత్ అలంకరణలో ఆర్‌సీఎం చర్చి

ప్రేమ..దయ..కరుణతో క్రీస్తు మానవాళి మనుగడకు మార్గదర్శకాలు అందించారు. అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న లోకానికి రక్షకుడిగా అవతరించారు. కరుణామయుని ఆగమనంతో యావత్ ప్రపంచం పులకిస్తుంది. ఆనందోత్సాహాలతో క్రిస్మస్ సంబరాలను జరుపుకుంటుంది. ఈ క్రమంలోనే తేజోమయునికి స్వాగతం పలుకుతూ క్రైస్తవులు చర్చిలను ముస్తాబు చేశారు. భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేపట్టారు. పాపాలను పరిహరించు ప్రభువా అంటూ వేడుకున్నారు.

- క్రీస్తు జననం..తేజోమయం
- క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం
- కరుణామయుని రాక కోసం ముస్తాబు
- వెలుగులు విరజిమ్ముతున్న చర్చిలు

తిరుపతి కల్చరల్ : నగరంలోని కేబీ లే ఔట్‌లో ఉన్న షెకీనా చర్చిలో క్రిస్మస్ సందర్భంగా మంగళవారం క్రిస్మస్ ఈవ్ క్యారల్స్ నిర్వహించారు. యువతీ యువకులు క్రిస్మస్ గీతాలను ఆలపించారు. పాస్టర్ అరుణ్ అరసు క్రిస్మస్ సందేశమిచ్చారు.

అలరించిన చిన్నారులు

వరదరాజనగర్, శ్రీపురం కాలనీ, ధనలక్ష్మీనగర్‌లోని భాష్యం పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు దేవదూతలు, శాంతాక్లాజ్ వేషధారణలతో సందడి చేశారు. ప్రిన్సిపల్ బాలాజీ మాట్లాడుతూ క్రిస్మస్ శాంతికి చిహ్నమని అందరూ ప్రేమ ఆప్యాయతలను పంచుతూ సోదర భావంతో సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. జోన్ ఇన్‌చార్జి లక్ష్మణ్ మాట్లాడుతూ క్రీస్తు జననం, విశిష్టతను వివరించారు. పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ఇన్‌చార్జి సుధాకుమారి, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, బిందు, మాధవి పాల్గొన్నారు.



ప్రార్థనలకు ముస్తాబైన ఆర్‌సీఎం చర్చి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఆర్సీ రోడ్డులోని సుధహా లిటిల్ సిటిజన్స్ హైస్కూల్లో ముందస్తు క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు.

ఘనంగా సంబరాలు

చంద్రగిరి : ఆర్ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో చేపట్టిన సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కరస్పాండెంట్ హితేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ క్రీస్తు బోధనలు కులమతాలకు అతీతంగా ఆచరించాలని కోరారు.

పాకాల : స్థానిక సీఎస్ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చి, కార్నర్‌స్టోన్, ఆదామ్ మందిరం, ఎబ్రోన్ మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో ప్రార్థనలకు హాజరయ్యారు. పాస్టర్ ప్రేమ్‌కుమార్ (సీఎస్ఐ చర్చి), ఫాదర్ ఆంథోని రాజ్(ఆర్‌సీఎం చర్చి) క్రిస్మస్ సందేశం ఇచ్చారు. బుధవారం స్థానిక చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు వెల్లడించారు.









శాంతాక్లాజ్, దేవదూతల వేషధారణలో చిన్నారులు , క్రిస్మస్ వేడుకలో సందడి చేస్తున్న చిన్నారులు, సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, బ్లూమింగ్ బడ్స్‌లో శాంటక్లాజ్‌తో పిల్లలు

పరీక్షల విభాగం ప్రక్షాళనకు వినతి



వీసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని కళాశాలలో మార్కుల ట్యాంపరింగ్ జరిగిందటూ వస్తున్న వార్తలు ఆందోళనకరమని, వెంటనే పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, బీసీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. మంగళవారం ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ రమణ, వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఇలాంటి తప్పిదాల కారణంగా విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ అసోసియేట్ ప్రొఫెసర్ కుట్రపూరితంగా మార్కులు టాంపరింగ్ చేయడం దారుణమని ఆరోపించారు. వాస్తవాలను వెలికితీసి బాధ్యును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భగత్ రవి, నాగేశ్వరావు, విజయ్, రామకృష్ణ నాయుడు, చంద్ర, భార్గవ్, స్వరేష్ నాయక్ పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యపై ఆవేదన



మాట్లాడుతున్న విశ్రాంత తహసీల్దార్ జయచంద్ర

తిరుపతి కల్చరల్ : తిరుచానూరు పంచాయతీ కొత్తపాళెం లేఔట్‌లలో తలెత్తిన మురుగునీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, పలుమార్లు ఫిర్యాదు చేసినా కార్యదర్శి పట్టించుకోవడం లేదని విశ్రాంత తహసీల్దార్ ఎస్.జయచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతి నగరం నుంచి వచ్చే మురుగు పెద్దకుంటలుగా ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. నిల్వ చేరిన మురుగు తాగునీటి పైపుల్లోకి చేరుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని మండిపడ్డారు. దీనికితోడు వారం నుంచి చెత్తను శుభ్రం చేయకపోవడంతో అందులో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

అమిత్‌షా వ్యాఖ్యలు అవమానకరం



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి అర్బన్ : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు జాతికి అవమానకరమని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు, నగర అధ్యక్షుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో తిరుచానూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి పదవికి అమిత్‌షా అనర్హుడని, ఆయన రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. అనంతరం డీఆర్‌ఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు,ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నేతలు వెంకటాచలపతి, దామోదర్‌రెడ్డి,రామకృష్ణ , సుప్రజ, నరేంద్ర, గోపి, మల్లికార్జున్, శివ బాలాజీ పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ బీఎస్పీ నేతలు సైతం డీఆర్‌ఓకు వినతి పత్రం అందించారు.

ఘనంగా హర్షిత్‌రెడ్డి జన్మదినోత్సవం



వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న నేతలు

చంద్రగిరి : వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చంద్రగిరిలోని పార్టీ కార్యాలయం వద్ద ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చిల్లకూరి యుగంధర్ రెడ్డి భారీ కేక్ కట్ చేశారు. అనంతరం సమీపంలోని హాస్టల్ పిల్లలకు కేక్‌తోపాటు పండ్లు పంచిపెట్టారు. నేతలు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఎనలేని సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. ఆయన నేతృత్వంలో కూటమి ప్రభుత్వంపై ప్రజా పోరాటాలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, పార్టీ చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పొర్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు యారాశి చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక నేతలు బోస్ చంద్రారెడ్డి, కొత్తపాటి మనోహర్, పసల నాగరాజు, రమేష్ రెడ్డి, మల్లం రాజశేఖర్, కొత్తపాటి మదన్, ప్రకాష్ రెడ్డి, సూరి పాల్గొన్నారు.

తుమ్మలగుంట: చెవిరెడ్డి నివాసంలో..

తిరుపతి రూరల్ : మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు హర్షిత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం తుమ్మలగుంటలోని ఆయన ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షిత్‌రెడ్డికి పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న అఖిలపక్ష నేత నారాయణరెడ్డి

తిరుపతి కల్చరల్: రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మిట్ట ప్రాంతాల అభివృద్ధి చెందాలంటే సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో రాయలసీమ సాగునీ టి ప్రాజెక్టుల అఖిలపక్షం కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి మాట్లారు. కృష్ణా నదిపై ప్రతిపాదిత ప్రాజెక్టులు ని ర్మించక పోవడంతో ప్రతిఏటా 800 నుంచి 1000 టీ ఎంసీల నీరు సముద్రంలోకి పోతోందన్నారు. అలాగే కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో 8 వేలకుపైగా చెరువులు ఉన్నాయని, రా యలసీమ వెనుకబడిన ప్రాంతాలు సమగ్రాభివృద్ధి చెందాలంటే రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి ఏటా రూ.7 వేల కో ట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హంద్రీ–నీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం విడ్డూరమన్నా రు. నిధులు విడుదల చేయని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మాంగాటి గోపాల్‌రెడ్డి, మురగారెడ్డి, కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రసాద్‌రావు, రాజేంద్ర, మాధవరావు, జబ్బార్ పాల్గొన్నారు.

అన్నమయ్యకు అవమానం

– ఆగ్రహం వ్యక్తం చేసిన భూమన



అన్నమయ్య విగ్రహానికి పెట్టిన శాంతాక్లాజ్ టోపీ

తిరుపతి మంగళం : పద కవితా పితామహుడికి తిరుపతిలో తీరని అవమానం జరిగింది. నగర ప్రధాన కూడలిలోని అన్నమయ్య విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు శాంతాక్లాజ్ టోపీని పెట్టారు. శ్రీవారి పరమభక్తుడైన అన్నమయ్యకు క్రిస్మస్‌తాతగా పిలవబడే శాంతాక్లాజ్ టోపీ పెట్టడంపై ప్రజలు మండిపడుతున్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

హిందూ మనోభావాలను దెబ్బతీసేందుకే..



మాట్లాడుతున్న భూమన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు క్షీణించాయని, హిందువుల మనోభావాలను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశా రు. 32వేల సంకీర్తనలతో శ్రీ వేంకటేశ్వరస్వామి మనసును గెలుచుకున్న అన్నమయ్యకు అపచారం చేయడం దారుణమని మండిపడ్డారు. సనాతన ధర్మం కాపాడతామని ఊదరగొట్టిన పవన్‌కల్యాణ్ స్వామీజీ, తిరుమల శ్రీవారు తమ కుల దైవమని చిలక పలుకులు వల్లించే చంద్రబాబు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూస్తామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలాంటి దుశ్చర్యలు జరగలేదని స్పష్టం చేశారు.ఈ క్రమంలోనే డీఎస్పీ వెంకటనారాయణ మాట్లాడుతూ అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ తొడిగింది ఓ యాచకుడిగా గుర్తించినట్లు వెల్లడించారు. అయితే సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

డీఎంహెచ్‌ఓకి అభినందనలు



అభినందనలు తెలుపుతున్న రాజా తదితరులు

తిరుపతి తుడా : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బాలకృష్ణ నాయక్‌ను మంగళవారం ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. కమిటీ సభ్యులు రోహిణి, టాటా బాయ్, సురేంద్ర, నాగరాజు, నరేష్, బాలాజీ, గంగమ్మ, జ్యోతి, పద్మావతి పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణపై అవగాహన



సూచనలిస్తున్న ఉద్యానశాఖాధికారి శైలజ

పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ మొరపల్లెలో రైతులకు మంగళవారం మామిడి పంట పూత దశలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై చంద్రగిరి మండల ఉద్యానశాఖ అధికారి ఎస్.శైలజ అవగాహన కల్పించారు. ఆమె మట్లాడుతూ మామిడి తోటల్లో పుల్లూర, ఖాదర్ రకాలకు ముందుగా పూత వచ్చిందన్నారు. ఈ క్రమంలో అన్ని రకాలకు ఒకేసారి పూత రావడానికి రైతులు 13:0:45–10 గ్రాములు, ఫార్ములా 4– 2 గ్రాములను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తెగుళ్ల నివారణకు క్లోరోపైరిపాస్ 50శాతం ఈసీ 2ఎంఎల్ లేదా బుప్రొఫెజిన్ 20శాతం,చ ఎసిఫేట్ 50శాతం డబ్ల్యూ–1గ్రాము, కాపర్ ఆక్సీ క్లోరైడ్–3 గ్రాములు, కార్బెండజిమ్ 12శాతం, మాంకోజెబ్ 63శాతం, డబ్ల్యూపీ–1.5గ్రాములు, గమ్– 0.5 మిల్లీ లీటర్‌ను ఒక లీటరు నీటికి కలిపి కాండంతోపాటు చెట్టు మొత్తం పడేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగు మందులను మాత్రమే వాడాలని, వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు పి.దేవకి, సీఆర్పీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న స్నేహలత

తిరుపతి సిటీ: వినియోగదారుల హక్కుల పరిరక్షణ, సామాజిక బాధ్యతే లక్ష్యమని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు స్నేహలత స్పష్టం చేశారు. మంగళవారం ఎస్వీఆర్ట్స్ కళాశాల వేదికగా జాతీయ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణ, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యత, సేవాలోపం కారణంగా జరిగిన నష్టానికి ఆయా సంస్థలపై నష్టపరిహారం కోరేటప్పుడు ఐదు లక్షల వరకు ఎలాంటి ఫీజు లేకుండా నేరుగా వినియోగదారులే ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలంరాజు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు పీ.రాజారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం– 2019 రూపొందించబడిందన్నారు. హెల్ప్ లైన్ నం.1930, ఆన్‌లైన్ నష్టం జరిగినప్పుడు నం .1915, వాట్సాప్ 8800001915 ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ నాన్ గోత్‌స్వామి, డీటీ జయరామ్, ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్యామ్‌బెనగల్ మృతికి సంతాపం

తిరుపతి కల్చరల్ : దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, సినీ దర్శకుడు శ్యామ్‌బెనగల్ మృతికి ప్రజానాట్య మండలి నేత నల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య సంతాపం తెలిపారు.

మత్తు.. యువత చిత్తు!

దేశాభివృద్ధికి దోహదపడాల్సిన యువత మత్తుకు బానిసగా మారుతోంది. మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలను ఛిద్రం చేసుకుంటోంది. ప్రధానంగా గంజాయికి అలవాటు పడి బతుకును అంధకారం చేసుకుంటోంది. వికృత చేష్టలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తోంది. చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాల్సిన వయసులో విపరీత పోకడలతో రెచ్చిపోతోంది. చంద్రగిరి శివారుల్లోని అసంపూర్తి నిర్మాణాలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేసుకుంది. ప్రశ్నించిన స్థానికులపై యథేచ్ఛగా దాడులకు పాల్పడుతోంది.

- మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్న యువకులు
- చంద్రగిరి శివారు ప్రాంతాల్లో యథేచ్ఛగా వినియోగం
- ప్రశ్నించిన వారిపై దారుణంగా దాడులు

మత్తు కోసం యువత వినియోగించిన డ్రగ్స్ (ఫైల్), అగరాల సమీపంలోని జగనన్న కాలనీలోని ఓ ఇంట్లో గంజాయి తాగేందుకు వాడిన సామగ్రి (ఫైల్)







సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తల్లిదండ్రుల కలలు నెరవేర్చాల్సిన పలువురు యువకులు మత్తుకు బానిసలుగా మారి జీవితాలను చేజేతులారా నాశనం చేసుకుంటున్నారు. విచ్చలవిడి మద్యం , మాదక ద్రవ్యాలు లభిస్తుండడంతో మత్తుకు అలవాడు పడుతున్నారు. తమ బతుకులను పాడు చేసుకోవడంతో పాటు ప్రజల ప్రాణాలతో కూడా చెలగాటం ఆడుతున్నారు. గంజాయి పీల్చడంతో పాటు మెడికల్ దుకాణాలను కొన్నిరకాల ఇంజెక్షన్‌లను వేసుకుంటూ మత్తులో జోగుతున్నారు. ఇటీవల చంద్రగిరి కేంద్రంగా చాలామంది యువకులు మత్తు తలకెక్కి రోడ్లపై అరుపులు కేకలు వేసి స్థానికులను బెంబేలెత్తిస్తున్నారు. శివారు ప్రాంతాల్లోని నిర్మాణాల్లో ఉన్న ఇళ్లలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సేవిస్తూ, చుట్టుపక్కల వారిని హడలెత్తిస్తున్నారు. మత్తుకు అలవాడు పడితే జీవితాలు నాశనమవుతాయని పోలీసు శాఖ హెచ్చరిస్తున్నా యువతలో మాత్రం మార్పు కనిపించడం లేదు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

గంజాయి మహమ్మారి పట్టి పీడిస్తున్న క్రమంలో విచ్చలవిడిగా మద్యం కూడా లభించడం యువత జీవితానికి శాపంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైన్‌షాపుల పక్కనే అనధికార పర్మిట్‌రూమ్‌లు ఏర్పాటయ్యాయి. ఈ అనధికార బార్లలో ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం అందుబాటులో ఉంటోంది. దీనికితోడు ఇబ్బడిముబ్బడిగా బెల్ట్ దుకాణాలు సైతం వెలిశాయి. దీంతో యువతే అత్యధికంగా మద్యం తాగుతున్నట్లు తెలుస్తోంది.

భౌతిక దాడులతో..!

రాత్రి వేళల్లో రోడ్డుపై నడిచి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వారం క్రితం రాయపురానికి చెందిన ఓ యువకుడిని కొంత మంది మత్తులో చితకబాదారు. దీనిపై బాధితుడు వారం పాటు పోలీసుల చుట్టూ ప్రదక్షిణలు చసినా చర్యలు శూన్యం. చివరకు ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని చెప్పిన తర్వాత తూతూమంత్రంగా పోలీసులు స్పందించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తాజాగా విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఆర్టీసీ కండక్టర్‌పై కొంత మంది యువకులు మత్తులో దాడికి తెగబడ్డారు. రాళ్లతో విచక్షణ రహితంగా కొట్టడంతోపాటు కండక్టర్ వద్ద ఉన్న పెన్ను తీసుకుని తలపై పొడిచారు. ప్రస్తుతం కండక్టర్ అపస్మారక స్థితిలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తలలోని ఎముక విరిగిందని, సర్జరీ చేయాలంటూ వైద్యులు తెలిపారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

నిద్రావస్థలో నిఘా వ్యవస్థ

గంజాయితోపాటు మెడికల్ దుకాణాల్లో ఇంజెక్షన్‌లు, మాత్రలను యువత యథేచ్ఛగా కొనుగోలు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. మత్తులో యువత రెచ్చిపోతున్నా, అరికట్టడంలో నిఘా వ్యవస్థ విఫలమవుతోంది. మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు, వినియోగాన్ని పసిగట్టి నివారించకుండా నిద్రావస్థలో ఉంది. ఎప్పుడైనా ఫిర్యాదు చేస్తే ఆ ప్రాంతం తమ పరిధిలోకి రాదంటూ కొందరు పోలీసులు నిర్మొహమాటంగా తరిమేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యువతను కాపాడాలని కోరుతున్నారు.





ఆర్టీసీ కండక్టర్ సుధాకర్‌పై యువకులు (ఫైల్), చికిత్స పొందుతున్న బాధితుడు (ఫైల్)